# చిత్రజీవులు

"విశాఖ"

(ఈ నాటికలోని పాత్రలందరూ కర్మ రోగులు. ఎవరి డబ్బా వాళ్ళే వాయించుకోగలరు. అంచేత పాత్రల్ని పరిచయం చెయ్యాల్సిన దుర్గతిలేదు. తెరఎత్తేసరికి స్టేజంతా చీకటిగావుంటుంది. రెండు సిగరెట్లు మాత్రం ఎఱ్ఱగా కాలుతూవుంటాయి. అంటే ఇద్దరు వ్యక్తులు స్టేజిమీద వున్నారని ప్రేక్షకులు ఊహించుకొంటారు. ఒక సిగరెట్టు నిశ్చలంగా కూర్చొని ఉంటుంది. మరొక సిగరెట్టు పచారు చేస్తుంటుంది. కొంతసేపటికి పచారుచేస్తున్న వ్యక్తి లైట్ వేస్తాడు. ఇద్దరూ కొంతసేపు మౌనం. కూర్చొన్న ఆయన కొద్దిగా వయస్సుమళ్లినవాడు.)

అతడు: (హఠాత్తుగా) ఓయ్ సుందరం...?

సుందరం: చిత్తం.

అతడు: అబ్బ! ఏం ఐడియా తట్టిందోయ్. నిజంగా గొప్ప బ్రెయిన్‌సుమ్మీ నాది.

సుందరం: అందుకు సందేహమా అండి.

అతడు: బాగాఅన్నావు. ఇంతకీ నాకు తట్టిన ఐడియా ఏమిటని అడగవేం?

సుం: అబ్బె! అట్టా కుండపగలేసినట్టు మొహంమీద పడి వెంటనే అడిగేస్తే అందులో సస్పెన్సే లేదు. సినీమా టెక్నిక్కి భంగం.

అతడు: ఐతే నేనే చెప్తాను విను.

సుం: మీరు చెప్తే బొత్తిగా చప్పగా వుంటుంది.

అతడు: ఐతే ఎట్లా?

సుం: చూసేరా ఎంత సస్పెన్స్ క్రియేట్ చేసేనో! ఈ విషయం బయటపడ్డం ఎలాగా అన్న అనుమానం మీలో కలిగిందిగా? ఇంక చెప్పండి. మీరు చెప్పేది ఎంత చెత్తైనాసరే మంచి ఎఫెక్టివ్‌గానే వుంటుంది.

అతడు: అసాధ్యుడిలాగున్నావే!

సుంద: కాకపోతే మీవెంట ఎందుకుంటాను? ఇంతకీ సస్పెన్సును మరీ పొడిగించబోకండి. మీకు తట్టిన ఐడియా ఎన్ని తక్కువ వాక్యాలలో చెప్పగలుగుతే, అన్ని తక్కువ వాక్యాలలో చెప్పండి. అద్భుతంగా వుంటుంది.

అతడు: ఐతే విను. మనిద్దరం ఈ రాత్రి వేళ ఇక్కడ హోటల్లోవున్న ఈ సంఘటన సినీమాగా తీస్తే, ఈ భాగం షూట్ చెయ్యడం ఎలాగా అని, నాకు బ్రహ్మాండమైన అనుమానం తట్టిందోయ్.

సుందరం: ఏం బ్రెయినండీ, మీది! ప్రపంచకంలో ప్రతి విషయాన్ని సినీమా డైరక్టర్ దృష్టితో చూస్తారే మీరు!

అతడు: లేకపోతే ఇంత గొప్ప డైరక్టర్ ఎట్లా అయే ననుకొన్నావు? ఈ భాగాన్ని షూట్ చెయ్యడానికి నాకో ఆలోచన తట్టింది.

సుందరం: ఏమిటది?

అతడు: ఇంతవరకూ మన ఇద్దరి సంభాషణవల్లా ప్రేక్షకులకి నీపేరు తెలుస్తుంది. నేను సినీమా డైరక్టర్‌నని తెలుస్తుంది. నువ్వు అసిస్టెంట్ డైరక్టర్‌వని ఊహించుకోగలరు. అంచేత మనిద్దరం ఒకర్నొకరు పేర్లుపెట్టి పిలుచుకొంటే పాత్రల పరిచయం పూర్తిగా తీరిపోతుంది.

సుందరం: బాగానే వుంది గాని అందులో పెద్ద టెక్నిక్ లేదు. అదీకాక మనపేర్లు తెలుస్తాయే కాని మనం ఇక్కడికెందుకొచ్చామో వాళ్ళకెట్లా తెలుస్తుంది? అంతకంటే మనిద్దరం ఎవరికివాళ్ళే ప్రేక్షకులకి పరిచయం చేసుకొంటే బాగుంటుందేమో...

అతడు: ఆపద్ధతి చాలా బాగుంది. ముందు నువ్వు కానీ.

సుందరం: (ప్రేక్షకులవైపు తిరిగి):- ఓ ప్రేక్షకమహాశయులారా! రసికశేఖరులారా! నాపేరు సుందర్రావు. నన్ను మా డైరక్టర్ సుందరం అని పిలుస్తుంటారు. నేను స్కూల్ ఫైనల్ రెండేళ్లు ఫేలయేను..

అతడు: కట్ కట్ కట్.

సుందరం: (విస్తుపోయి) ఏం?

అతడు: రెండేళ్ళేమిటి? తప్పు తప్పు మూడేళ్లు.

సుందరం: మూడోఏడు పరీక్షకి కూర్చోలేదండి.

అతడు: అదినాకు తెలీదటయ్యా. సంభాషణలు అక్కడక్కడ బ్రేక్ చేస్తూ వుండాలి. సస్పెన్సుకోసం కట్ అన్నాను.

సుందరం: ఏం బ్రెయినండీ మీది! (ప్రేక్షకులవైపు తిరిగి) స్కూల్ ఫైనల్ పరీక్షకి కూర్చొని కూర్చొని విసిగి వేసారి ఏ ఉద్యోగం లేక చివరకు సినీమాల్లో చేరేను, ఎక్స్ట్రానటుడిగా.

అతడు: కట్ కట్. నువ్వు ఎక్స్ట్రా నటుడిగా చేరలేదు. టీ కప్పులందించే బోయ్‌గా చేరేవు.

సుందరం: నేను సినిమాలో మొదట టీకప్పులందించే బోయ్‌గా చేరేను. కాని రాను రాను నా అదృష్టం తిన్నబడింది. ఈనాడు నేను అసిస్టెంట్ డైరక్టర్ని. డైరక్టర్‌కి సలహా లివ్వడం మొదల్కొని సినీమాస్టార్స్‌కి టీ కప్పులందించడంవరకూ నా డ్యూటీయే. నాకు నెలకి 250 జీతం. ఈ మధ్య మా కంపెనీ చిత్రాలు అంతగా డబ్బు చేసుకోవటంలేదు. అంచేత మా ప్రొడ్యూసర్ అందరికీ జీతాలు బాకీపెట్టేరు. నాకు సరిగ్గా ఆరునెల్ల జీతం ఇవ్వాలి. మూడు నెల్ల జీతం పుచ్చుకొని పూర్తిజీతం ముట్టినట్లుగా రసీదిమ్మన్నారు మా ప్రొడ్యూసర్ గారు. ఏం చెయ్యను? నాకు డబ్బు చాలా అవసరమైంది. మూడునెల్లజీతం పుచ్చుకొనే తృప్తిపడ్డాను.

అతడు: కట్ కట్, ఇష్టంవచ్చినట్లు మాట్లాడుతున్నావే?

సుందరం: అబ్బ! ప్రతీదీ మీతో చెప్పలేక చస్తున్నానండీ. ఇదంతా సస్పెన్సు. చూడండి ఇంతవరకూ నన్ను ఒట్టి ఫూల్ అనుకొంటూ వుంటారు ప్రేక్షకులు. కాని నా ఆర్థికపరిస్థితిలోని రహస్యం విడదీసి చెప్పేసరికి వాళ్ళకి నాపైన చెప్పరానంత సానుభూతి ఏర్పడుతుంది. ఇంత సరదాగా మాట్లాడే ఈ వ్యక్తి హృదయంలో ఎంత విషాదం దాక్కొనిఉందో అనిపిస్తుంది. కామెడీ అంతా ఒక్కసారిగా ట్రాజెడీగా మారిపోతుంది.

అతడు: ట్రాజడీలు తీస్తే డబ్బురాదు.

సుందరం: చూసేరా ఎంతచక్కగా నన్ను ప్రేక్షకులికి పరిచయం చేసుకొన్నానో! నాగురించి ప్రేక్షకులకి పూర్తిగా తెలుసు. ఇంక మీ పరిచయం కానీండి.

అతడు: (ప్రేక్షకులవైపు తిరిగి.) ఓ ప్రేక్షకసింహులారా! సినీమాసదులారా!! నా పేరు రంగదాసు. నేనొక సినీమా ప్రొడ్యూసర్ని...(కొంతసేపు ఆగి) డైరక్టర్ని కూడా (సుందరంవైపు తిరిగి) ఎలాగుందోయ్ సస్పెన్సు?

సుందరం : అద్భుతం. అద్భుతం. ఊఁ. కానీండి.

అతడు : (ప్రేక్షకులతో) మా సినీమా సంస్థ పేరు హాస్యకళాపిక్చర్సు. ఇంత వరకు మా కంపెనీ మూడు చిత్ర నీరాజనాల్ని ఆంధ్రచిత్రకళాభారతికి హారతులుగా సమర్పించింది. (సుందరంతో) ఎలా వుంది?

సుందరం : నీరాజనాలన్న తర్వాత హారతులనడం అనవసరం. కాని ఫరవా లేదు.

అతడు : (ప్రేక్షకులతో) ఆ మూడు చిత్రాల పేర్లు "శంపావతి", "భువన సుందరి", "చిత్రలేఖ." ప్రస్తుతం మా సంస్థ బ్రహ్మాండమైన ప్రయత్నంతో నాలుగో చిత్రం తీయడానికి సన్నాహాలు చేస్తోంది. ఈసారి సాంఘిక చిత్రం తీస్తాం. చిత్రం పేరు "ప్రణయజీవులు."

సుందరం : సస్పెన్సు తగ్గిపోతోంది.

అతడు : ఇప్పుడు తియ్యబోయే చిత్రం తెలుగు, తమిళ భాషలు రెండింటిలో తీయడానికి ఏర్పాట్లు పూర్తయినయ్. కాని ఈ చిత్రంలో కథానాయికగా నటించడానికి సరియైన నటి లభ్యం కావడం లేదు.

సుందర : కారణం?

అతడు : ఎందుచేతనంటే, ఈ మధ్య తారల రేట్లు బాగా పెరిగిపోయినై. కాస్తా కూస్తా ప్రసిద్ధిచెందిన తార 50 వేలుకి తక్కువైతే రావడం లేదు. అంత డబ్బు ఒక్క హీరోయిన్‌కే ఇచ్చినట్లైతే మా కంపెనీ మూసేసి నా పూర్వపు బట్టలదుకాణంలోనే కూర్చోనవలసి వస్తుంది.

సుందరం : అందుచేత?...

అతడు : అందుచేత తక్కువ డబ్బుతో హీరోయిన్ని బుక్ చేసుకొందుకి క్రొత్త తారల్ని వెతుక్కుంటూ వచ్చేం నేనూ, మా అసిస్టెంట్ సుందరం. ఊర్లన్నీ తిరుగుతున్నాం. కాని మాకు నచ్చిన అమ్మాయి ఎవరూ కనిపించడం లేదు. అందుచేత "ఏం దారిరా భగవంతుడా" అని అర్ధరాత్రివేళ ఈ హోటేల్లో బసచేసి విచారిస్తున్నాం. (బిగ్గరగా) సినీమాల్లో హీరోయిన్‌గా నటించడానికి మా కెవ్వరూ కనిపించడం లేదు. ఆ సక్తివున్న వాళ్లు ఎవరైనా వస్తే బాగుండును.

(హఠాత్తుగా తలుపు తెరచుకొని ఒక యువకుడు, యువతి ప్రవేశం.)

యువకుడు : హీరోయిన్‌గా వెయ్యడానికి కొత్త తారల్ని వెతుక్కుంటున్నారా అండి మీరు?

అతడు : కావచ్చు. మీరెవరు.?

యువకుడు : నా పేరు ధర్మారావంటారండి. నాకు కొద్దిగా కవిత్వం రాయడం, పాటలు కట్టడం వచ్చును. (యువతితో, మూల మూలకి నిల్చుంటా వేమే? ముందుకి రా. (అతనితో) ఇదిగో ఈ అమ్మాయి నా భార్యలెండి. చాలా అందంగా వుంటుంది కదూ?

అతడు : కావచ్చులెండి.

ధర్మా : మీరు సినీమాల్లో నటించడానికి ఆసక్తివున్న వాళ్ళువస్తే బాగుండును అంటే ఈమెను తెచ్చేను. మేం ప్రక్కగదిలోనే బసచేసేం లెండి.

సుందరం : ఏదైనా వూరు వెళ్తున్నారా?

ధర్మా : మెడ్రాస్ వెళ్తున్నాం లెండి. సుమారు ఏడాదిగా నా భార్య ఒకటే బాధ పెడుతోంది సినీమాల్లో చేర్పించమని. చాలా బాగా పాడుతుంది.

అతడు : పాట రాకపోయినా ఫరవా లేదులెండి. ఆ అమ్మాయి మొహం స్క్రీన్‌కి పనికొస్తుందా అని ఆలోచిస్తున్నాను. (సుందరంతో) నీ అభిప్రాయం?

సుందరం : ఫస్టుగా పనికొస్తుంది. (ఆమెతో) మీ పేరు?

ఆమె : శోభ.

సుందరం : ఎంత అందమైన పేరు! ఆ పేరే చెబుతోంది మీకు సినీమారంగంలో ఉజ్వలమైన భవిష్యత్తు వుందని. (ప్రొడ్యూసర్ తో) మరింకేం ఆలోచించకుండా తక్షణం బుక్ చెయ్యండి ఈమెను.

ప్రొడ్యూసరు : రేపు అందరం మెడ్రాస్ పోదాం. మేం వచ్చినపనీ ఐంది. మీరు వెళ్లబోయే పనీ అయింది.

ధర్మా, శోభ : వస్తాం. రేపు ప్రొద్దున్నే మాట్లాడుకొందాం (నిష్క్రమణ).

సుందరం : వీళ్లెవరో అసాధ్యుల్లా వున్నారే? మన మాటలు చాటుగా విని పిలవకుండానే చక్కా వచ్చేరు. బలే సస్పెన్సు!

డైరక్టరు : సస్పెన్సేమిటి నీ బొంద! ఎలా వుంది నా ఏక్షన్?

సుందరం : ఏం ఏక్షను?

డైరక్టరు : ఇంతసేపూ నేను చేసినదంతా.

సుందరం : నాకేం అర్థం కావడం లేదు.

డైరక్టరు : ఈ మాత్రం ఊహించుకోలేనివాడివి ఎందుకు పనికొస్తావ్? చెప్తాను విను. ఇవాళ మధ్యాహ్నం వీళ్లిద్దరూ మన ప్రక్కగదిలో బసచెయ్యటం చూసేను. ఆ అమ్మాయి నెలాగైనా సినీమాల్లోకి లాగాలనిపించింది. తీరా అడుగుతే ఏమంటారో! అంగుకని ఈ పన్నాగమంతా పన్ని "సినీమాల్లో నటించడానికి కుతూహలం ఉంటే రావచ్చు"నని బిగ్గరగా అరచేను. నేను అనుకొన్నట్లుగానే వాళ్లే చక్కా వచ్చారు. అడబోతే తీర్థ మెదురైందన్నట్లు.

సుందరం : అబ్బ! ఏం బ్రైనండీ మీది. మిమ్మల్ని బ్రహ్మ చాలా నేర్పుగా సృష్టించేడు.

డైర : నిన్నుకూడా. (తెర)

★

## గిలిగింతలు!



ఒకడు:—బ్రదర్! నీ జేబులో హఠాత్తుగా పది రూపాయలనోటు కనిపిస్తే ఏం చేస్తావ్?

మరొకడు:- పొరపాటున ఇంకొకరి చొక్కా తొడుక్కున్నాననుకుంటాను.

* * *

ఎప్పుడూ చిరుగుడ్డలు కట్టుకునే లక్షాధికారిని ఒక స్నేహితుడడిగాడు:

"ఏమయ్యా. ఇంత డబ్బుంది. కాస్త మంచిబట్టలు తొడుక్కోలేవూ?"

"ఏం ఇవి మంచివి కావా?"

"ఏం మంచి గడమంచి. మీ నాన్నగారు ఇలాగే ఉండేవారా? ఎప్పుడూ మల్లె పువ్వుల్లాంటి బట్టలు తొడుక్కునే వారు."

"మరి ఇవి బాగాలేవంటా వేం? ఇవి మా నాన్నగారి బట్టలే"